

ఆ వీఆర్‌ఓ రూటే సప'రేటు'

నంద్యాల రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఓ వీఆర్‌ఓ లంచావతారమెత్తాడు. ఫైసలిస్తే చాలు ప్రభుత్వ భూములైనా.. పట్టా భూములైనా.. ఇతరులకు ఆన్‌లైన్ చేస్తాడు. 8లో▸

పరివార దేవుళ్లకు పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నకు బయలు వీరభద్ర స్వామికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. ప్రత్యేక నైవేద్యం సమర్పించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,626.12
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 80.000
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 1,35,000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 1,50,000

న్యూస్‌రీల్

యాటకల్ బ్రిడ్జిని వెంటనే నిర్మించండి

- కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలసి విన్నవించిన ఎమ్మెల్యే విరూపాక్షి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

కర్నూలు(సెంట్రల్): వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో యాటకల్లు సమీపంలో ఉన్న బ్రిడ్జి కూలిపోవడంతో 20 గ్రామాలకు మండల కేంద్రమైన ఆస్పరికి రాకపోకలు నిలిచిపోయాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు విన్నవించారు. మంగళవారం ఆయన కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలసి రోడ్డును యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..యాటకల్ బ్రిడ్జి కూలిపోవడంతో తంగరడోణ, తురువగల్లు, తొగలగల్లు,దొడకొండ, కళ్లపరి, కైరుప్పల, కారుమంచి తదితర గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నట్లు చెప్పారు. వెంటనే బ్రిడ్జిని నిర్మించాలని కలెక్టర్‌ను కోరానన్నారు.

నేటి నుంచి పెద్దరాజుస్వామి ఉరుసు



బేతంచెర్ల: మతసామరస్యానికి ప్రతీకగా వెలసిన గూటుపల్లె పెద్దరాజు స్వామి దర్గా ఉరుసు బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉరుసు సందర్భంగా బుధవారం గంధం, గురువారం ఉరుసు, శుక్రవారం జియారత్ వేడుకలు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, గోవా రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు దర్గా పీఠాధిపతి గురు సయ్యద్ అక్బర్ బాషా ఖాద్రి తెలిపారు.

డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): ఏపీ స్టేట్ అలైడ్ అండ్ హెల్త్ కేర్ సర్వీసెస్ డిప్లొమా కోర్సులకు ఇంటర్మీడియట్ అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయిసుధీర్ మంగళవారం తెలిపారు. అభ్యర్థులు పూరించిన దరఖాస్తులను సెప్టెంబర్ 8వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు కర్నూలు మెడికల్ కాలేజీలో రూ.100 రుసుం చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు apsahpc.in వెబ్‌సైట్‌లో లభిస్తాయన్నారు. సెప్టెంబర్ 19న కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఇంటర్ బైపీసీ చదివిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు.

అమ్మకానికి పొట్టిరకం జొన్న సిద్ధం

నంద్యాల(అర్బన్): నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఎన్‌టీజే-5 పొట్టి రకమైన జొన్న అమ్మకానికి సిద్ధంగా ఉందని ఏడీఆర్ విల్సన్ మంగళవారం తెలిపారు. జిల్లాలో మాఘీ సీజన్ (సెప్టెంబర్ నుంచి లేట్ రబీ నవంబర్)కు ఈ రకాన్ని విత్తుకోవచ్చని చెప్పారు. ఈ రకం నాణ్యమైన విత్తనం 100 క్వింటాళ్లు (పునాది విత్తనం) అందుబాటులో ఉందని, కిలో రూ.90 ప్రకారం అమ్మకాలకు సిద్ధంగా ఉంచామన్నారు.



కూటమి ప్రభుత్వంలో చేయి తడపనిదే ఏ పనీ జరగని పరిస్థితి. సామాన్య ప్రజలే కాదు, అధికారులు సైతం తమ పని కావాలంటే నేతల వద్ద చేతులు కట్టుకోవాల్సిందే. ఇక బదిలీల విషయానికొస్తే సిఫారసు లేఖలు లేనిదే ఉన్నతాధికారులు సంబంధిత ఉద్యోగులను పరిగణనలోకి తీసుకోవడం లేదని తెలుస్తోంది. ఈ లేఖల కోసం నాయకుల చుట్టూ పనులు వదలుకొని ప్రదక్షిణ చేయాల్సి వస్తోంది. అంతేకాదు.. కొందరైనా లేఖల కోసం పోస్టును బట్టి డబ్బు వసూలు చేస్తుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇలా అంతో ఇంతో ఇచ్చి కోరుకున్న పోస్టులు దక్కించుకున్న అధికారుల్లో నిజాయితీ ఎంత మాత్రం ఉంటుందో ఇట్టే అర్థమవుతుంది.

సిఫారసు లేదంటే పోస్టింగ్ సరిహద్దుకే!

- గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి
- అర్హతల ఆధారంగా గ్రేడ్–4కు మార్పు
- కోరుకున్న చోటుకు పోస్టింగ్ కోసం విశ్వప్రయత్నాలు
- సిఫారసు లేఖల కోసం నాయకుల చుట్టూ ప్రదక్షిణలు
- 120 ఖాళీలకు ఇప్పటికే వందకు పైగా లేఖలు
- ఎవరి ఆశీస్సులు లేకపోతే సరిహద్దు ప్రాంతాలకు బదిలీ



జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం ఎదుట కూమిగూడిన పంచాయతీ కార్యదర్శులు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రామ సచివాలయాల్లో గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న వారిలో అర్హతలను అనుసరించి గ్రేడ్–4 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి కల్పించారు. పదోన్నతి పొందిన వీరు తాము కోరుకున్న ప్రాంతానికి పోస్టింగ్ ఇప్పించుకునేందుకు స్థానిక ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. నాయకులు ఇచ్చే సిఫారసు లేఖలకే బదిలీలు ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. పచ్చ నేతల సిఫారసు లేఖలు ఉంటే కోరుకున్న చోటుకు, లేదంటే జిల్లా సరిహద్దులకు బదిలీ చేస్తున్నట్లు కొందరు ఉద్యోగులు వాపోతున్నారు. ఎలాంటి రాజకీయ పరిచయాలు లేని వారు, సిఫారసు లేఖలు తెచ్చుకోని వారిని నంద్యాల జిల్లా నల్లమల సరిహద్దు ప్రాంతాలకు, కర్నూలు జిల్లాలోని కర్ణాటక రాష్ట్ర సరిహద్దు గ్రామాలకు పోస్టింగ్స్ ఇస్తున్నట్లు పదోన్నతి పొందిన సచివాలయ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో చేపట్టిన పదోన్నతుల పోస్టింగ్స్‌కు రెండు జిల్లాల నుంచి వందల సంఖ్యలో గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు.

సిఫారసులకే పెద్దపీట

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 403 మంది గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న 120 గ్రేడ్ –4 పంచాయతీ కార్యదర్శుల పోస్టులను భర్తీ చేసేందుకు 120 మంది గ్రేడ్ –5 పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించారు. గతంలో వారికి వచ్చిన మార్కులు (ర్యాంకింగ్), రోస్టర్, రిజర్వేషన్ ప్రకారం పదోన్నతులు కల్పించినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా, పోస్టింగ్స్ విషయంలో ర్యాంకింగ్, రిజర్వేషన్ ఉన్నా.. పచ్చనేతల సిఫారసు లేని కారణంగా వారు కోరుకున్న ప్రాంతానికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

మిగిలిన స్థానాలకే ఆప్షన్లు

ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు జారీ చేసిన సిఫారసు లేఖల ఆధారంగా ఖాళీలను భర్తీ చేసి, మిగిలిన ఖాళీల్లో ఎక్కడికి వెళ్తారో మీరే నిర్ణయించుకోండని పదోన్నతి పొందిన వారి నుంచి ఆప్షన్స్ తీసుకున్నట్లు తెలుస్తోంది. సిఫారసు లేఖలతో కోరుకున్న ప్రాంతానికి పోస్టింగ్స్ ఇప్పించుకున్న వారు సంతోషంగా ఉండగా, ఎలాంటి రాజకీయ సిఫారసు లేకపోవడంతో సరిహద్దు ప్రాంతాల గ్రామాలకు పోస్టింగ్స్ అందుకున్న వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన కార్యక్రమాలకు అసోసియేషన్ నేతలను ఆహ్వానించే వారని, ప్రస్తుతం ఆ సంప్రదాయం కొనసాగడం లేదనే అభిప్రాయాన్ని పలువురు నేతలు వ్యక్తం చేస్తున్నారు.

మాదకద్రవ్యాల రవాణాను పూర్తిగా అరికట్టాలి





మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా, చిత్రంలో ఎస్పీ విక్రాంత్‌పాటిల్, హాజరైన అధికారులు

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో గంజాయి, కొకైన్ సహా అన్ని రకాల మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నార్కోటిక్స్ కోఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. యూనివర్సిటీలు, కాలేజీల్లో మత్తు పదార్థాల వినియోగంపై వర్క్‌షాపులు, ర్యాలీలు తదితర అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలో కూడా విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగంతో కలిగే లాభనష్టాలపై అవగాహన కల్పించాలన్నారు. కర్నూలు, ఆదోని, పత్తికొండ డివిజన్లలో మాదక ద్రవ్యాల నివారణకు తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ ఆయా ఆర్డీఓలను అడిగి తెలుసుకున్నారు. మత్తు బానిసలకు రీహ్యాబిలిటేషన్ సెంటర్‌లో కౌన్సెలింగ్ ఇప్పించేందుకు చర్యలు డీఎంహెచ్‌ఓను డాక్టర్ శాంతికళను ఆదేశించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం, సాగును పూర్తిగా నియంత్రించేందుకు అన్ని శాఖల అధికారులు పోలీసులకు సహకరించాలన్నారు. కర్నూలు నగరంలో కేసీ కెనాల్, బస్టాండ్, రైల్వే స్టేషన్, పార్కులు, ఖాళీ ప్రదేశాలు, ఫ్లైఓవర్ల కింద మత్తు పదార్థాలను సేవించే వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం మత్తు పదార్థాల నిర్మూలనకు సంబంధించి ముద్రించిన పోస్టర్లను కలెక్టర్, ఎస్పీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, కర్నూలు మునిసిపల్ కమిషనర్ పి.విశ్వనాథ్, డీటీసీ శాంతకుమారి, ఆర్‌టీసీ ఆర్‌ఎం శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయాధికారి పీఎల్ వరలక్ష్మీ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు పాల్గొన్నారు.

జిల్లాలో తేలికపాటి వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వివిధ మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. అధిక వర్షాల కారణంగా జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద మండలాలు మినహా మిగిలిన అన్ని మండలాల్లో వర్షపాతం నమోదైంది. గూడూరులో 21 మి.మీ, ఆదోనిలో 17.6, మంత్రాలయంలో 16, సి.బెలగల్‌లో 14.6, ఎమ్మిగనూరులో 12.4, ఓర్వకల్‌లో 11.6, గోనెగండ్లలో 10 మి.మీ ప్రకారం వర్షాలు కురిశాయి. జిల్లా మొత్తం సగటున 7.1 మి.మీ వర్షపాతం నమోదైంది. బుధవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు. తర్వాత జిల్లాలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందన్నారు.

1676 హెక్టార్లలో పంట నష్టం

కర్నూలు(అగ్రికల్చర్):అధిక వర్షాల వల్ల జిల్లా లో 1,676 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. తుగ్గలి, పెద్దకడుబూరు, ఆస్పరి, కౌతాళం, ఆదోని, దేవన కొండ, మద్దికెర మండలాల్లోని 36 గ్రామాల్లో అధిక వర్షాల ప్రభావం ఉన్నట్లు వ్యవసాయ అధికారులు నిర్ధారించారు. పత్తి 984 హెక్టార్లు, కంది 357 హెక్టార్లు, వేరుశనగ 107 హెక్టార్లు, ఆముదం 98 హెక్టార్లు, సజ్జ 148 హెక్టార్లలో దెబ్బతిన్నాయి. ఉద్యాన పంటలు మరో 20 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు తెలుస్తోంది.

నది తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మంత్రాలయం: తుంగభద్ర నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు సూచించారు. మంగళవారం మంత్రాలయం మఠం సమీపంలోని నదీ తీరాన్ని సీఐ రామాంజులు, ఎస్‌ఐ శివాంజల్‌లతో కలిసి పీఠాధిపతి పర్యవేక్షించారు. తుంగభద్ర నది ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తోందన్నారు. వరద నీరు గంగమ్మ గుడి, పుష్కర ఘాట్లను తాకినట్లు గుర్తించారు. భక్తులు నదిలో స్నానాలు చేయకుండా నిలిపి వేయాలని, షవర్ల వద్ద స్నానాలు చేసేలా చూడాలని అధికారులకు సూచించారు. నది తీరం వద్ద భద్రత కట్టుదిట్టం చేయాలని పోలీసులను కోరారు.



నది తీరాన్ని పరిశీలిస్తున్న పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు, సీఐ రామాంజులు



స్వర్ణరథోత్సవ పూజల్లో పాల్గొన్న దేవస్థాన ఈఓ, అర్చకులు, అధికారులు



భక్తజనం మధ్య స్వర్ణరథోత్సవ దృశ్యం

నేత్ర పర్వం.. స్వర్ణ రథోత్సవం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోమంగళవారం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని వేకువజామున స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు అర్చకస్వాములు జరిపించారు. స్వర్ణ రథోత్సవంలో ముందుగా అర్చకులు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం రథారూఢులైన స్వామిఅమ్మవార్లకు విశేషపూజలు చేశారు. ఉదయం 7.30 గంటలకు స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. ఆలయ మహాద్వారం ముందుభాగం గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు రథోత్సవం కొనసాగింది. రథోత్సవంలో కోలాటం, చెక్కభజన మొదలైన జానపద కళారూపాలు ఆకట్టుకున్నాయి. స్వర్ణ రథోత్సవంలో ఈఓ శ్రీనివాసరెడ్డి, ఏఈవో హరిదాసు, అర్చకులు, వేదపండితులు, పలు విభాగాల అధికారులు, పర్యవేక్షకులు, ఇతర సిబ్బంది, శివసేవకులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కూటమి మోసం.. దివ్యాంగులకు శాపం

కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చకుండా కోతలకు సిద్ధమైంది. సామాజిక పింఛన్ లబ్ధిదారుల జాబితాలో అనర్హుల ఏరివేత పేరుతో అర్హులను తొలగిస్తుండటంతో అందరిలో ఆందోళన మొదలైంది. ఎన్నికల ముందు కూటమి నేతలు ఇంటింటికీ వెళ్లి హామీలు గుప్పించారు. దివ్యాంగులకు పింఛన్ రూ. 6 వేలు, ఇంట్లో మంచం మీద ఉన్న వాళ్లకు రూ.. 15 వేలు', దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ. 10 వేలు అంటూ ఊరించారు. ఏరివేతలో భాగంగా వికలత్వ పరీక్షలు నిర్వహించి వైకల్య శాతం తగ్గించి నోటీసులు ఇవ్వడంతో లబ్ధిదారుల్లో గుబులు మొదలైంది. వచ్చే నెల నుంచి పింఛన్ రాదని తెలుసుకుని లబోదిబోమంటున్నారు. – సాక్షి, నెట్‌వర్క్

మాటలకందని ఆవేదన..



➤ గతంలో అధికారులు ఇచ్చిన 98 శాతం వికలత్వం సర్టిఫికెట్ చూపుతున్న ఈ మహిళ పేరు గొల్ల అరుణ. కోసిగి మండలం వందగల్లు సొంతూరు. పుట్టుకపోతోనే చెవిటి, మూగ. తన బాధ, సంతోషాన్ని ఇతరులతో పంచుకునే భాగ్యం లేదు. ఎవరు ఏమి మాట్లాడుతున్నారో వినిపించలేని పరిస్థితి. గతంలో ఇచ్చే దివ్యాంగుల పింఛన్‌ను కూటమి ప్రభుత్వం ఇప్పుడు నిలిపేస్తామని నోటీసు ఇవ్వడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ప్రభుత్వం, అధికారులు అనుసరిస్తున్న తీరుపై ఆవేదన వ్యక్తం చేసింది. తమలాంటి వారికి సాయం చేసి ఆదుకోవాలే తప్ప.. ఇలాంటి కఠినమైన నిర్ణయాలు తీసుకోవడం ఎంతవరకు సబబు అంటూ గొల్ల అరుణ మూగ సైగలతో వాపోతోంది.



25 ఏళ్ల చంటి బిడ్డ.. అయినా అనర్హుడే

➤ మంచంపై కూర్చున్న యువకుడికి 25 ఏళ్లు. పేరు షమీవుల్లా. అతడికి అన్నం తినిపిస్తున్నది తల్లి జమాల్‌బీ. పాతికేళ్ల వయస్సులో కూడా చంటి బిడ్డలా తల్లి దగ్గరుండి అన్నీ చూసుకోవాల్సిన పరిస్థితి. పుట్టుకతోనే మానసిక వికలాంగుడు, కుడి చేయి, కుడి కాలు పని చేయవు, ప్రతి క్షణం వెంట ఓ మనిషి ఉండాల్సిందే. స్వతహాగా ఏ పని చేసుకోలేడు. 2011లో వంద శాతం వికలత్వ సర్టిఫికెట్ ఇచ్చారు. రూ.200 నుంచి ఇప్పటి వరకు పింఛన్ తీసుకుంటున్నాడు. అన్నం కూడా వేరే వారే తినిపించాలి. ఎప్పుడు పడితే అప్పుడు ఫిట్స్ వస్తుంటాయి. ఇలాంటి పింఛన్‌దారుడికి ఇటీవల నంద్యాలలో నిర్వహించిన సదరం క్యాంపులో 40 శాతం కంటే తక్కువ వికలత్వం ఉందని, ఇక నుంచి పింఛన్ తొలగిస్తున్నట్లు అధికారులు నోటీసు అందజేశారు. చూసిన వారంతా 'ఇతనికి పింఛన్ తొలగించడమేమిటీ' అని చర్చించుకుంటున్నారు.



ప్రభుత్వానికి కనికరమేదీ?

➤ ఈ చిత్రంలో మంచంపై పిల్లాడిలా కనిపిస్తున్న దివ్యాంగుడు పేరు సూరపురెడ్డి వెంకటరమణారెడ్డి. స్వగ్రామం కొలిమిగుండ్ల మండలం రాఘవరాజుపల్లె. వయస్సు 34 ఏళ్లు. పుట్టుకతోనే దివ్యాంగుడు. మూడు పదుల వయసున్నా చిన్న పిల్లాడి తరహాలో చూసుకోవాల్సి వస్తుంది. రెండు కాళ్లు పూర్తిగా సహకరించవు. గతంలో సదరం క్యాంపుకు వెళ్లినపుడు 90 శాతం ఉన్నట్లు గుర్తించి సర్టిఫికెట్ ఇచ్చారు. ఆరు నెలల క్రితం ప్రభుత్వం రీవెరిఫికేషన్ నిర్వహించింది. ఇటీవల గ్రామ సచివాలయంలో ఇచ్చిన సర్టిఫికెట్‌లో 74 శాతం ఉన్నట్లు ఇచ్చారు. ఇది ఎంత వరకు సమంజసమని రమణారెడ్డి ప్రశ్నిస్తున్నాడు. 90 శాతం వైకల్యం ఉంటే రూ.15వేల పింఛన్ సొమ్ము ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఆదిశగా లేకుండా ఏకంగా దివ్యాంగుల వైకల్యంలోనూ మార్పులు చేయడం గమనార్హం

రూ. 15 వేల పింఛన్ రూ.6 వేలు చేశారు



➤ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు మాధవరెడ్డి. పదేళ్ల క్రితం పక్షవాతం బారిన పడి ఇంటికే పరిమితమయ్యాడు. కుటుంబసభ్యుల సహాయం లేకపోతే కూర్చోలేడు.. పడుకోలేడు. ఇతనికి గతంలో రూ.15 వేలు పింఛన్ వచ్చేది. 90 శాతం వికలత్వం ఉన్నట్లు గతంలో డాక్టర్లు సదరం సర్టిఫికెట్ ఇచ్చారు. ఇటీవల కూటమి ప్రభుత్వం రీ రెఫికేషన్ పేరుతో 70 శాతానికి తగ్గించి ఈ నెల నుంచి రూ.6 వేల పింఛన్ మాత్రమే ఇచ్చారు. దీంతో ఇంట్లో వాళ్లు ఆఫీసు చుట్టూ తిరిగినా తమకేమి తెలియదు అని జవాబు ఇస్తున్నారని కుటుంబ సభ్యులు వాపోయారు.



వికలత్వం కనిపించదా?


➤ చిత్రంలోని మహిళ పేరు ముర్తుజాబీ, పాములపాడుకు చెందిన ఈమెకు చిన్నప్పుడు కంటికి దెబ్బ తగిలి చూపు కోల్పోయింది. భర్త గౌండ పని చేసేవాడు, ప్రస్తుతం అనారోగ్యంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. ముర్తుజాబీకి వచ్చే వికలాంగ పింఛనే ఆ కుటుంబానికి ఎంతో ఆసరా. ఇప్పుడు ఆ పింఛన్ తొలగిస్తున్నట్లు నోటీసు రావడంతో ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వానికి పేదల కష్టాలు కనిపించవని, ఎన్నో ఏళ్లుగా వస్తున్న పింఛన్ ఆపేస్తే తమ పరిస్థితి ఏమిటని ముర్తుజాబీ వాపోతోంది.

పాపం పాపయ్య..



➤ ఇక్కడ కుర్చీలో కూర్చున్న దివ్యాంగుడు పాపయ్యది కొలిమిగుండ్ల మండలం చింతలాయి పల్లె గ్రామం. పదేళ్ల పైబడి నుంచి కాలు, చేయి పని చేయక పోవడంతో అచేతనంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. 90 శాతం వైకల్యం ఉన్నట్లు వైద్యులు గుర్తించి సర్టిఫికెట్ ఇవ్వడంతో పింఛన్ వస్తుండేది. ఇటీవలనే ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో అతని పేరు గల్లంతయ్యింది. ఎన్నో నెలల నుంచి తీసుకుంటున్న పింఛన్ తొలగించడం శోచనీయం. తమ సహకారం లేనిదే ఏపని చేసుకోలేని వ్యక్తికి పింఛన్ తొలగించడం దారుణమని కుటుంబ సభ్యులు వాపోతున్నారు.

90 శాతాన్ని 50కి తగ్గించారు



➤ మంచానికి పరిమితమైన 88 ఏళ్ల షేక్ అబ్దుల్‌గఫార్ పక్షవాతం బాధితుడు. బనగానపల్లె పట్టణం ఈద్గా నగర్‌లో నివాసముంటున్నాడు. 2014 నుంచి పక్షవాతంతో ఇతను మాట్లాడలేడు, జ్ఞాపక శక్తి కూడాలేదు. నంద్యాల సదరన్ క్యాంప్‌లో 2014 ఫిబ్రవరి 14న 90 శాతం వికలాంగుడిగా సర్టిఫికెట్ పొందారు. కూటమి ప్రభుత్వంలో ఏడాది రూ.15వేల పింఛన్ ఇచ్చారు. ఇటీవల జరిగిన సదరన్ క్యాంపులో వికలాంగుడిగా 50 శాతం మాత్రమే ఉన్నట్లు సచివాలయ అధికారులు అతనికి రెండు రోజుల క్రితం నోటీసు ఇచ్చారు. ఇక నుంచి రూ.6వేలు మాత్రమే పింఛన్ వస్తుందని చెప్పడంతో కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు. కదలలేని స్థితిలో ఉన్న వృద్ధుడికి 50 శాతం మాత్రమే వికలత్వ సర్టిఫికెట్ ఇవ్వడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

విద్యార్థిని అదృశ్యం


పవిత్ర (ఫైల్)

సంజామల: మండల పరిధిలోని ముదిగేడు గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని అదృశ్యమైంది. ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కుంటి గోపాల్, లక్ష్మిదేవి దంపతుల కుమార్తె పవిత్ర సంజామల ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. సోమవారం వర్షం కారణంగా అధికారులు పాఠశాలకు సెలవు ప్రకటించారు. దీంతో బాలిక ఇంటి వద్దనే ఉంది. తల్లిదండ్రులు పశువులను మేపేందుకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే సరికి బాలిక కనపడక పోవడంతో బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా ఆచూకీ తెలియలేదు. దీంతో మంగళవారం పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు


పాణ్యం వద్ద బోల్తా పడిన కారు

పాణ్యం: మండల కేంద్రంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒద్దరికి గాయాలైనట్లు హైవే పోలీసులు మంగళవారం తెలిపారు. వివరాలు.. కేఆర్ఆర్ తాండాకు చెందిన బాబునాయక్ వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై పాణ్యంకు వెళ్లి తిరిగి వస్తుండగా తండా సమీపంలో వెనక వచ్చిన ఏపీ 39 జీఈ 1683 నంబర్ గల కారు ఢీకొట్టింది. ఈ కారు కరీంనగర్ నుంచి రాయచోటికి వెళ్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాబునాయక్‌ను హైవే అంబులెన్స్‌లో నంద్యాలకు తరలించారు. అలాగే పాణ్యం ఫ్లైఓవర్‌పై సోమవారం అర్ధరాత్రి నంద్యాలకు చెందిన కారు బేతంచెర్ల నుంచి నంద్యాలకు వెళ్తుండగా కారు టైర్ బరస్టు కావడంతో అదుపుతప్పి బోల్తా పడిందన్నారు. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు క్షేమంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న హైవే పోలీసులు ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా వాహనాలను తొలగించారు.

పాము కాటుకు మహిళ మృతి

కౌతాళం: పాము కాటుకు మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గంగమ్మ (54) పశువులకు గడ్డి తీసుకొచ్చేందుకు గడ్డివాముకు పోతుండగా పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు స్థానికంగా చికిత్స చేయించి ఆదోనికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక ఆమె రాత్రి మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు. మృతురాలికి భర్త హనుమేష్, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి..


మృతి చెందిన అబ్దుల్‌బాషా

మంత్రాలయం రూరల్: మండల కేంద్రానికి చెందిన ఎం.అబ్దుల్‌బాషా (48) గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. మంత్రాలయంకు చెందిన అబ్దుల్‌బాషా మూడేళ్లుగా మతిస్థిమితం లేక తిరుగుతుండేవాడు. డాక్టర్లకు చూపించినా వ్యాధి నయంకాలేదు. ఈ స్థితిలో సోమవారం రాత్రి ఇంటి వద్ద భోజనం చేసిన తరువాత మండలంలోని చిలకడోణ- కల్లుదేవకుంట గ్రామాల మధ్యలోని 167వ జాతీయ రహదారిలోని నారాయణరెడ్డి పొలం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అబ్దుల్‌బాషా అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుమారుడు జాఫర్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ శివాంజల్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు వెల్లడించారు.

ఆ వీఆర్ఓ రూటే సపరేటు

- ఒక్కో డీ పట్టాకు రూ.50 వేలు
- జాయింట్ ఎల్‌పీ నంబరు విడగొడితే రూ.20 వేలు
- పైసలిస్తే చాలు ప్రభుత్వ భూములైనా ఆన్‌లైన్‌లో ఎక్కిచ్చేస్తాడు

నంద్యాల(అర్బన్): స్థానిక రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఓ ద్వితీయ శ్రేణి అధికారి వీఆర్ఓ లంచావతారమెత్తాడు. జాయింట్ ఎల్‌పీ నంబరును విడగొట్టేందుకు రూ.20 వేలు, ఒక్కో డీ పట్టాకు రూ.50 వేలు, చిన్నచిన్న పనులకు రూ.10 వేలు గుంజుతున్నాడు. పైసలిస్తే చాలు ప్రభుత్వ భూములైనా పట్టా భూములైనా ఇతరులకు ఆన్‌లైన్ చేస్తాడు. ఏడాది క్రితం సాధారణ బదిలీల్లో భాగంగా గాజులపల్లె గ్రామ వీఆర్ఓగా విధులు నిర్వహిస్తూ నంద్యాల రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. జాతీయ రహదారి సమీపంలో ఉన్న గ్రామ వీఆర్ఓగా ఉంటూ అసైన్డ్ భూముల్లో అవినీతి పొజిషన్ సర్టిఫికెట్ల పేరుతో విక్రయాలు, ఉద్దేశపూర్వకంగా తప్పులు సృష్టించి రైతుల వద్ద నుంచి డబ్బులు గుంజడం, సమస్యలపై సచివాలయానికి వచ్చే రైతుల నుంచి దలారుల ద్వారా డబ్బులు వసూలు చేయడం అత్యవసరమంటే ఇప్పుడు కాదు.. టైం పడుతుందంటూ అమౌంట్లను సెటిల్ చేసుకోవడం అలవాటుగా మారింది.


నంద్యాల రూరల్ తహసీల్దార్ కార్యాలయం

ఇటీవల జాయింట్ ఎల్‌పీ నంబర్లను విడగొట్టేందుకు స్థానిక కో-ఆప్షన్ మెంబర్ వద్ద నుంచి రూ.15 వేలు తీసుకున్నట్లు తెలిసింది. సర్వే నంబర్ 21/1లోని 1.99 ఎకరాల వంక పోరంబోకు భూముల్లో ఇళ్ల స్థలాల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చేందుకు, సర్వే నంబర్ 109/1లోని 1.84 ఎకరాల సీలింగ్ ల్యాండ్ భూములకు సంబంధించి ల్యాండ్ కన్వర్షన్ చేయకుండా ప్లాట్ల ఏర్పాటుకు పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు సమాచారం.

అగ్రికల్చర్ ల్యాండ్‌ను నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌గా మార్పు చేయడం, భూమిని చేతులు మార్చడంలో ఆయనకు ఆయనే సాటి. పొలాలకు సంబంధించి మ్యూటేషన్ పనులు పూర్తి చేస్తామంటూ ఓ రైతు వద్ద నుంచి రూ.20 వేలు వసూలు చేసినట్లు సమాచారం. ఇలా ఒకటేమిటి అన్ని పనులకు చేయి తడపాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

ప్రధాన జాతీయ రహదారి సమీపంలోని వాగు పోరంబోకు, సీలింగ్ ల్యాండ్, ఇనాం భూముల్లో పట్టాల ఏర్పాటులో వీఆర్ఓకు రూ.లక్షల్లో చేతులు మారాయన్న ఆరోపణలు వినబడుతున్నాయి. పొలాలకు సంబంధించి మ్యూటేషన్ పూర్తి చేసే ఏర్పాటులో భాగంగా రైతులు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ వద్దకు వెళితే వీఆర్ఓను కలిసిన తర్వాతనే మ్యూటేషన్ పనులు పూర్తవుతాయంటూ చెబుతుండటం, రైతులను ఆందోళనలకు గురి చేస్తోంది. పది సెంట్ల చొప్పున తేడాలు వచ్చే భూముల కొలతలను సరిచేసేందుకు వేలకు వేలు ముక్కుపిండి వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. డబ్బు ముట్టనిదే ఆయన ఏపని చేయరని బహిరంగ విమర్శలు వినబడుతున్నాయి. డీపట్టాలు కొన్న వారి పేర్లను సైతం రికార్డుల్లో ఎక్కించే ప్రయత్నాలు చేస్తున్నారని, ఆయన అనుకుంటే రికార్డులను సైతం తారుమారు చేస్తారన్న విమర్శలున్నాయి. భూములను సైతం ఆన్‌లైన్‌లో ఎక్కిస్తానంటూ వాటికి ఆనుకొని ఉన్న రైతులకు సమాచారం ఇచ్చి ముడుపులు దన్నుకుంటున్నాడని తెలుస్తోంది. 1431, 32, 33, 34, 35 పసిలీలకు పన్నులు వేసి రైతుల వద్ద నుంచి ముక్కుపిండి వసూలు చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి సారించి ఇలాంటి అవినీతి తిమింగాలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

బెస్త కార్పొరేషన్ చైర్మన్‌ను తొలగించాలి


మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ రాజశేఖర్

నంద్యాల(అర్బన్): నకిలీ సర్టిఫికెట్‌తో బెస్త కార్పొరేషన్ చైర్మన్ పదవి పొందిన బొమ్మన శ్రీధర్‌ను వెంటనే తొలగించాలని బెస్త సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షుడు రమణ, ఏపీ ఫిషర్‌మెన్ జేఏసీ చైర్మన్ రాజశేఖర్ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం స్థానిక ఉదయానంద్ ఫంక్షన్‌హాల్‌లో రాయలసీమ జిల్లాల వ్యాప్తంగా మత్స్యకార, బెస్త కులాలకు చెందిన నేతల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. సీమ జిల్లాల్లో బెస్తలు అధికంగా ఉన్నారని, అయితేకార్పొరేషన్ చైర్మన్ పదవిని బెస్త కులం కాని వారైన బొమ్మన శ్రీధర్‌కు ఇవ్వడం సమంజసం కాదన్నారు. ఇది బెస్త వర్గాలను మోసం చేయడమేనని మండిపడ్డారు. మత్స్య కులాల మధ్య చిచ్చురేపేందుకే కూటమి ప్రభుత్వం ఇలాంటి చర్యలకు ఒడిగట్టిందన్నారు. వెంటనే శ్రీధర్‌ను తొలగించి బెస్త సంఘం నాయకులకు పదవి ఇవ్వాలని లేకుంటే భారీ ఎత్తున ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అప్పలరాజు, బెస్త కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గిరిబోయిన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేయండి


మాట్లాడుతున్న ఆర్‌జేసీ చంద్రశేఖర ఆజాద్

మహానంది: ఆలయాల భూముల అన్యాక్రాంతం అంశంపై డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, ఈఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర ఆజాద్ ఆదేశించారు. మహానందిలోని టీటీడీ కల్యాణ మండపంలో కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లోని దేవస్థానాల నిర్వాహకులతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆర్‌జేసీ మాట్లాడుతూ.. బాధ్యతాయుతంగా పని చేయని వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్యాక్రాంతం అయిన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడంలో నిర్లక్ష్యం వహించే వారికి మెమోలు జారీ చేస్తామని స్పష్టం చేశారు.

దేవుళ్లకు ఆధార్ ఉంటుందా?

ఆలయ భూముల అన్యాక్రాంతం విషయంపై ఆర్‌జేసీ ఆజాద్ ఓ ఈఓను వివరాలు కోరగా రెవెన్యూ కార్యాలయాలకు వెళ్తే ఆధార్ కార్డులు అడుగుతున్నారని చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవుళ్లకు ఆధార్ కార్డు ఉంటుందా అని ప్రశ్నించారు. మిగతా దేవస్థానాలకు చెందిన భూముల విషయంలో వర్తించని నిబంధనలు మీకే ఎలా వర్తిస్తుందన్నారు. వివిధ జిల్లాల్లో ఉన్న దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్లు, డిస్ట్రిక్ట్ ఎండోమెంట్ ఆఫీసర్లు తరచూ వెళ్తూ పరిశీలించాలని కోరారు. ఆలయాల స్థల పురాణాలపై ఈవోలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రధాన ముఖ ద్వారాల వద్ద భక్తులకు కనిపించేలా ఏర్పాటు చేయాలని సూచించారు.

సాధారణ భక్తుడిలా వెళ్లి పరిశీలన

ఆర్‌జేసీ చంద్రశేఖర ఆజాద్ ముందుగా మహానందీశ్వర స్వామి దర్శనానికి ఓ సాధారణ భక్తుడిలా వెళ్లారు. అక్కడక్కడ లోపాలు ఉండడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచిత దర్శనం బోర్డు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. టికెట్లు తీసుకోవాలని చెప్పే సిబ్బంది ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద ఉండడంపై మండిపడ్డారు. సమావేశంలో మహానంది ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, జిల్లా డీసీ గురుప్రసాద్, మద్దిలేటి స్వామి ఆలయ డిప్యూటీ కమిషనర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

13 మంది సీఐల బదిలీ

కర్నూలు (అర్బన్): కర్నూలు రేంజ్ పరిధిలో 13 మంది సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

ఇన్‌స్పెక్టర్ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
జి.సుబ్బారావు	వీఆర్, కడప	కడప,2వ పట్టణ పీఎస్
ఎన్.కృష్ణయ్య	వీఆర్, కడప	బద్వేల్, రూరల్ సర్కిల్
ఎం.నాగభూషణ్	బద్వేల్ రూరల్ సర్కిల్	సి.కె.దిన్నె, యూపీఎస్
ఎస్.డి.శివశంకర్ నాయక్	సి.కె.దిన్నె, యూపీఎస్	ఎస్‌బీ2, కడప
డి.భాస్కర్ రెడ్డి	ఎస్‌బీ2, కడప	ఎస్‌బీ1, కడప
ఆర్.పురుషోత్తం రాజు	ఎస్‌బీ1, కడప	ఎస్సీ/ఎస్టీ సెల్, కడప
వి.వేణుగోపాల్	ఎస్సీ/ఎస్టీ సెల్, కడప	ప్రొద్దుటూరు, 3వ పట్టణ యూపీఎస్
ఎ.గోవింద రెడ్డి	ప్రొద్దుటూరు త్రీటౌన్	యూపీఎస్‌వీఆర్, కడప
జి.జీవన్ గంగనాథ్ బాబు	వీఆర్, నంద్యాల	డీసీఆర్‌బీ, నంద్యాల
పూల రామకృష్ణ	డీసీఆర్‌బీ, నంద్యాల	సీసీఎస్1, కర్నూలు
ఎం.నాగశేఖర్	సీసీఎస్1, కర్నూలు	ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్ ఆన్ డిప్యూటేషన్
ఎం.రామయ్య నాయుడు	డీటీసీ, కర్నూలు	ఉమెన్ పీఎస్2, కర్నూలు
టి.అబ్దుల్ గౌస్	ఉమెన్ పీఎస్2, కర్నూలు	డీటీసీ, కర్నూలు

విరిగిపడిన బస్సు చక్రం


విరిగిపడిన ఆర్టీసీ బస్సు చక్రం

ఆత్మకూరు: పట్టణ సమీపంలోని కె.జి.రోడ్డులో కర్నూలు నుంచి ఆత్మకూరుకు వస్తున్న ఆర్టీసీ హైర్ బస్సు (ఏపీ 39 యూకే 2407)కు తృటిలో ప్రమాదం తప్పింది. బస్సు కె.జి.రోడ్డులో వస్తుండగా ముందు టైర్ అకస్మాత్తుగా పగిలింది. దీంతో యాక్సిల్ నుంచి ఊడిపోయి దొర్లుతూ ముందుకు వెళ్లి పడింది. డ్రైవర్ అప్రమత్తమై బస్సును నిలిపివేశాడు. బస్సులో 16 మంది ప్రయాణికులు ఆత్మకూరు బస్టాండుకు చేరుకోవాల్సి ఉంది. బస్సు నెమ్మదిగా వస్తుండటంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. వేగం ఎక్కువైతే డివైడర్‌ను ఢీకొట్టి ఫల్టీ కొట్టే ప్రమాదం ఉండేది. పెను ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయంపై ఆర్టీసీ డీఎం వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఘటనా స్థలాన్ని సందర్శించానని, తమ పరిధిలో బస్సులు కండీషన్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. హైర్ బస్సు ఓనర్‌తో మాట్లాడామని, బస్సులు కండీషన్ లేకపోతే రద్దు చేస్తామన్నారు.

'స్త్రీ శక్తి'కి అదనంగా బస్సులు కేటాయించాలి

కర్నూలు సిటీ: 'స్త్రీ శక్తి' పథకానికి అదనంగా బస్సులు కేటాయించాలని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరుణ, అలివేలు, ఉపాధ్యక్షురాలు సుజాత డిమాండ్ చేశారు. మంగళవారం ఐద్వా ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్‌లో వేచి ఉన్న మహిళా ప్రయాణికులతో వారు మాట్లాడారు. ప్రయాణికులకు తగిన సదుపాయాలు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం అవేవీ లేకుండానే హడావుడిగా మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని అమలు చేశారన్నారు. ఆదోని నుంచి ఆత్మకూరుకు ప్రయాణం చేయాలంటే రెండు బస్సులు మారాలని, ఇలా ప్రయాణించాలంటే అదనపు సమయం పడుతుందన్నారు. తిరుపతి, అన్నవరం, విజయవాడ వంటి ఆధ్యాత్మిక కేంద్రాలకు ఉచితంగా ప్రయాణం చేయొచ్చని కూటమి నేతలు ప్రచారం చేశారని, కానీ ఆచరణలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. తగినన్నీ బస్సులు లేకపోవడంతో కిక్కిరిసిన ప్రయాణికుల మధ్య మహిళలు అవస్థలు పడుతూ నుంచొని ప్రయాణించాల్సి వస్తోందని వాపోయారు.

జాతీయ ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా డి.హుస్సేన్



అవార్డు అందుకుంటున్న డి.హుస్సేన్

కర్నూలు(సెంట్రల్): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ నిర్వహించిన కాంటెస్టులో కర్నూలు సాక్షి అసిస్టెంట్ చీఫ్ ఫొటోగ్రాఫర్ దూదేకుల హుస్సేన్ అచీవ్‌మెంట్ విభాగంలో జాతీయ స్థాయి ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా అవార్డు అందుకున్నారు. మంగళవారం విజయవాడలోని గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్, ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీష, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు.


అవార్డుకు ఎంపికైన ఫొటో

డి.హుస్సేన్ ఇప్పటి వరకు 9 జాతీయ, 12 రాష్ట్ర స్థాయి ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డులు అందుకోవడం విశేషం.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ జిల్లా ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగ కమిటీలో పలువురిని నియమించారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ నాయకులను నియమిస్తున్నట్లు మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది.

హోదా	పేరు	నియోజకవర్గం
ఉపాధ్యక్షుడు	చంద్రశేఖర్ రెడ్డి	ఆలూరు
ఉపాధ్యక్షుడు	సీఎల్ఎన్ వర్మ	మంత్రాలయం
ప్రధాన కార్యదర్శి	డి.ఆగస్టీన్	పత్తికొండ
ప్రధాన కార్యదర్శి	మధుసూదన్ రెడ్డి	కోడుమూరు
ప్రధాన కార్యదర్శి	జె.కురువ పట్టాబి	ఆదోని
కార్యదర్శి	ఎస్.వెంకటరాముడు	పత్తికొండ
కార్యదర్శి	సురేంద్ర	ఆలూరు
కార్యదర్శి	కె.ఆర్.నర్సి రెడ్డి	మంత్రాలయం
కార్యదర్శి	జె.హనుమంతారెడ్డి	ఆదోని
కార్య నిర్వహణ సభ్యులు	జి.రాచప్ప	పత్తికొండ
కార్య నిర్వహణ సభ్యులు	రంగన్న	ఆలూరు
కార్య నిర్వహణ సభ్యులు	ఎం.ఎల్.కుమార్	మంత్రాలయం
కార్య నిర్వహణ సభ్యులు	జె.మునిస్వామి	ఆదోని

అంబులెన్స్ డ్రైవర్ దుర్మరణం

- లారీ, అంబులెన్స్ ఢీకొనడంతో ప్రమాదం


మృతిచెందిన ఖతాల్ షేక్ హుసేన్


ప్రమాద స్థలంలో విచారణ చేస్తున్న పోలీసులు

గోనెగండ్ల: మండల కేంద్రం సమీపంలో భారత్ గ్యాస్ గోడౌన్ వద్ద మంగళవారం ఉదయం అంబులెన్స్, లారీ ఢీకొన్న ప్రమాదంలో ఎమ్మిగనూరుకు చెందిన అంబులెన్స్ డ్రైవర్ ఖతాల్ షేక్ హుసేన్ (30) మృతిచెందినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. వివరాలు.. ఎమ్మిగనూరుకు చెందిన ఖతాల్ షేక్ హుసేన్‌కు భార్య హసీనా ఉంది. హుసేన్ సొంతంగా అంబులెన్స్ వాహనం నడుపుతున్నాడు. ఎమ్మిగనూరులోని ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి రోగులను కర్నూలు ఆస్పత్రులకు తరలించేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఎమ్మిగనూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి నుంచి రోగిని అంబులెన్స్ (ఏపీ 21 టీజెడ్ 6342)లో కర్నూలు ఆస్పత్రికి తీసుకెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున తిరిగి వస్తుండగా ఉదయం 6 గంటల సమయంలో గోనెగండ్లలోని భారత్ గ్యాస్ గోడౌన్ వద్ద ఎదురుగా ఉల్లి గడ్డల లోడ్‌తో కర్నూలుకు వెళుతున్న లారీ(ఎంహెచ్ 13 డీక్యూ 9693) ఢీకొట్టింది. ప్రమాదంలో అంబులెన్స్ నుజ్జునుజ్జుకాగా హుసేన్ తీవ్రగాయాలతో అందులోనే ఇరుక్కుపోయాడు. అటుగా వెళుతున్న ప్రయాణికులు హుసేన్‌ను బయటకు తీసి చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరుకు తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. లారీని పోలీసులు సీజ్ చేసి స్టేషన్‌కు తీసుకెళ్లారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గిరిజన సంక్షేమానికి కృషి


అధికారులతో సమీక్షిస్తున్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి

శ్రీశైలం టెంపుల్: రాష్ట్రంలోని గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. మంగళవారం శ్రీశైల దేవస్థాన పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమం, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్.భార్గవి, జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శివప్రసాద్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు. అనంతరం పలువురు గిరిజన నాయకులు, సంఘాల నాయకుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. సమీక్ష అనంతరం మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఐటీడీఏల వద్ద రూ.కోటి నిధులతో గిరిజన ఉత్పత్తుల మార్కెట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా శ్రీశైలంలో గిరిజన ఉత్పత్తుల మార్కెట్‌కు శంకుస్థాపన చేస్తానన్నారు. అలాగే ఆత్మకూరు వద్ద బైర్లూటీలో 1500 మంది గిరిజనుల కోసం నన్నారి జ్యూస్ పరిశ్రమను ప్రారంభించనున్నట్లు తెలిపారు. శ్రీశైల దేవస్థానంలో చెంచు, గిరిజనులకు దుకాణాలు ఉన్నాయని, వాటి సంఖ్య పెంచడంతో పాటు మినిమం అద్దె చెల్లించే విధంగా ఈఓకు సూచించామన్నారు. అలాగే ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా గిరిజన ప్రాంతాల్లో రోడ్ల ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్‌తో కలిసి శ్రీశైలం ఐటీడీఏ ప్రచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు.

దివ్యాంగులను ఏడి'పింఛెన్'

- కర్నూలు జిల్లాలో 4731, నంద్యాల జిల్లాలో 4099 పింఛన్ల రద్దు
- రోడ్డెక్కుతున్న దివ్యాంగులు
- మనోవేదనతో చాగలమర్రిలో దివ్యాంగుడి ఆత్మహత్యాయత్నం


డోన్ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న దివ్యాంగులు

కర్నూలు(అగ్రికల్చర్): పింఛన్ల అడ్డగోలు తొలగింపులపై దివ్యాంగులు పెద్దఎత్తున ఆందోళనలకు దిగుతున్నారు. మాకు అర్హత ఉంది అయినా పింఛన్ తొలగించారంటూ శారీరక దివ్యాంగులు, అంధులు, చెవిటి - మూగ వారు ఒకవైపు మండల పరిషత్ కార్యాలయాలు, మరోవైపు జిల్లా కలెక్టర్, డీఆర్‌డీఏ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. ఇంకా వందలాది మంది దివ్యాంగులు నోటీసులు అందుకోలేదు. దీంతో రానున్న రోజుల్లో ఆందోళనలు వెల్లువెత్తే అవకాశం ఉంది. డోన్, మద్దికెర, ఆదోని, తుగ్గలి తదితర మండలాల్లో దివ్యాంగులు ఉద్యమ బాట పట్టారు. కూటమి ప్రభుత్వం నోటి దగ్గరి ముద్ద లాగేసుకోవడంపై వేలాది మంది కన్నీరుమున్నీరవుతున్నారు. పింఛన్ రద్దు కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన దివ్యాంగుడొకరు పురుగు మందు తాగడం సంచలనం సృష్టిస్తోంది. నంద్యాల జిల్లా చాగలమర్రిలో మహబూబ్‌బాషా అనే దివ్యాంగుడు పింఛన్ రద్దు కావడంతో జీర్ణించుకోలేక పురుగు మందు తాగారు. గతంలో ఇచ్చిన సదరం ధృవపత్రంలో వికలత్వం 72 శాతం ఉండగా ఇప్పుడు రీ అనాలసిస్‌లో 40 కంటే తక్కువకు పడిపోయింది. దీంతో సచివాలయ ఉద్యోగులు పింఛన్ రద్దయ్యిందంటూ నోటీసు చేతిలో పెట్టారు. నోటి దగ్గరి ముద్దను లాగేసుకున్నట్లుగా జీవనాధారమైన పింఛన్ రద్దు కావడంతో తట్టుకోలేక పురుగు మందు తాగడం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కలకలం రేపింది. ఈయన పరిస్థితి విషమంగా ఉండటంతో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కూటమి ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో 8830 దివ్యాంగుల కుటుంబాల్లో చిచ్చు పెట్టింది. జీవనాధారమైన పింఛన్ రద్దు కావడంతో దివ్యాంగుల్లో ఆందోళన వెల్లువెత్తుతోంది.

- కర్నూలు జిల్లాలో 4731 దివ్యాంగ పింఛన్లలపై ప్రభుత్వం అనర్హత వేటు వేసింది. కర్నూలు జిల్లాలో దివ్యాంగ పింఛన్ తీసుకుంటున్న 674 మందిని వృద్ధాప్య పింఛన్‌లుగా మార్పు చేశారు. రూ.15 వేలు హెల్త్ పింఛన్‌లు తీసుకుంటున్న వారిలో 17 మందికి అనర్హత వేటు వేశారు.
- నంద్యాల జిల్లాలో 4099 దివ్యాంగ పింఛన్‌లపై అనర్హత వేటు పడింది. నంద్యాల జిల్లాలో దివ్యాంగ పింఛన్లు 25,256 ఉండగా 22,411 మంది పింఛన్‌దారులను రీ వెరిఫికేషన్ చేశారు. ఇందులో 4099 పింఛన్‌దారులను అనర్హులుగా తేల్చారు. 719 దివ్యాంగుల పింఛన్‌లను వృద్ధాప్య పింఛన్‌లుగా మార్పు చేశారు. నంద్యాల జిల్లాలో హెల్త్ పింఛన్‌లు 873 ఉండగా అన్నింటినీ వెరిఫై చేశారు. ఇందులో 64 హెల్త్ పింఛన్‌లకు అనర్హత ఉన్నట్లు తేల్చారు. 323 హెల్త్ పింఛన్‌లను దివ్యాంగ పింఛన్లుగా మార్పు చేశారు. మరో 20 హెల్త్ పింఛన్‌లను వృద్ధాప్యం కిందకు మార్చారు.
- హెల్త్ పింఛన్లకు రూ.15 వేలు ఇవ్వాల్సి ఉండగా దివ్యాంగ పింఛన్లకు మార్చడం వల్ల కేవలం రూ.6 వేలు మాత్రమే ఇస్తారు. తద్వారా ఒకరి పింఛన్ నుంచి ప్రభుత్వం రూ.9 వేలు కోత పెడుతుంది.
- దివ్యాంగ పింఛన్లకు రూ.6 వేలు ఇవ్వాల్సి ఉండగా వృద్ధాప్యం కిందకు మార్చడంతో రూ.4 వేలు మాత్రమే ఇస్తారు. తద్వారా ఒకరి పింఛన్ సొమ్ములో రూ.2 వేలు కోత పడుతుంది. పింఛన్ లబ్ధిదారుల సంఖ్య, వారికిచ్చే సొమ్మును తగ్గించేందుకు ప్రభుత్వం ఇలాంటి కుట్రలు పన్నుతున్నట్లు పింఛనుదారులు వాపోతున్నారు.

హాస్టల్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(అర్బన్): ఓర్వకల్ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో ఫుడ్ పాయిజన్ ఘటనకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పీడీఎస్‌యూ, యుఎస్‌ఎఫ్ఐ, ఆర్‌వీఎఫ్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సంఘాల నాయకులు మహేంద్రబాబు, వెంకటేష్, ఉదయ్ తదితరులు స్థానిక సంక్షేమ భవన్‌లోని సాంఘిక సంక్షేమం సాధికారత అధికారిణి బీ.రాధికకు సమస్యను వివరించి న్యాయం చేయాలని బైఠాయించారు. వారు మాట్లాడుతూ.. సంక్షేమ అధికారులు కుర్చీలకే పరిమితమై హాస్టళ్ల పర్యవేక్షణను గాలికొదిలేశారని ఆందోళన వ్యక్తం చేశారు.